ఇఫ్తార్‌ కోసం రూ.70 కోట్లా..?

నాంపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఇఫ్తార్‌ విందు కోసం రూ.70 కోట్లు మంజూరు చేయడం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమేనని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర మైనార్టీ కమిషన్‌ మాజీ చైర్మన్‌, మాజీ పీసీసీ ఉపాధ్యక్షుడు ఆబిద్‌ రసూల్‌ ఖాన్‌ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సీఎం రేవంత్‌ రెడ్డికి లేఖ రాశారు. ఇఫ్తార్‌ కోసం రూ.70 కోట్లు ఖర్చు చేయడం వృధా అని, ఈ మొత్తాన్ని మైనార్టీ సంక్షేమానికి కేటాయించాలని సూచించారు.ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరారు. సదరు నిధులను మైనార్టీ విద్య, వైద్య కళాశాలలకు కేటాయిస్తే ప్రభుత్వ నిర్ణయాన్ని అందరూ హర్షిస్తారని, భవిష్యత్‌ తరాలకు మేలు చేసినవారవుతారని లేఖలో పేర్కొన్నారు.

జాతీయ సదస్సులో సిటీ కాలేజీ విద్యార్థుల ప్రతిభ

చార్మినార్‌: ప్రభుత్వ సిటీ కాలేజీ భౌతిక శాస్త్ర విభాగానికి చెందిన పీజీ విద్యార్థుల బృందం వరంగల్‌లో శుక్రవారం జరిగిన ఎన్‌ఐటీ డైమండ్‌ జూబ్లీ సదస్సులో పత్ర సమర్పణ చేసింది. రెండు రోజుల పాటు కొనసాగే ఆసెంట్‌–2025 జాతీయ సదస్సులో సిటీ కాలేజ్‌ విద్యార్థుల బృందం గ్రీన్‌ టెక్నాలజీ ఆధారంగా నానో కాంపోజిట్స్‌పై పరిశోధనను ప్రదర్శించి ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్‌ ప్రొ. బాలభాస్కర్‌ విద్యార్థుల బృందాన్ని అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం..

చార్మినార్‌: సుల్తాన్‌ షాహిలోని షాహిన్‌ ఉమెన్‌ రిసోర్స్‌ అండ్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ కేంద్రంలో పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొంది. హింసకు గురైన మహిళలు, బాలికలకు అవసరమైన మద్దతు కోసం మహిళా శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల సహాయ సహకారాలతో షాహిన్‌ ఉమెన్‌ రిసోర్స్‌ అండ్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ పనిచేస్తుందన్నారు. ఇందులో భాగంగా చంపాపేట్‌లో ప్రారంభించనున్న సఖి సెంటర్‌లో పని చేసేందుకు వివిధ కేటగిరిలో దరఖాస్తులు ఆహ్వానిస్తుర్నుమన్నారు. ఈనెల 22 నుంచి 29 సాయంత్రం 5 గంటల్లోగా అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులను అందజేయాలన్నారు. సెంటర్‌ అడ్మినిస్ట్రేటర్‌, కేస్‌ వర్కర్‌, సైకో సోషల్‌ కౌన్సిలర్‌, లీగల్‌ కౌన్సిలర్‌, పారామెడికల్‌ వర్కర్‌, ఐటీ అసిస్టెంట్‌, మల్టీపర్పస్‌ వర్కర్‌ పోస్టులకు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాల కోసం సుల్తాన్‌ షాహిలోని సంస్థ కార్యాలయంలో గాని.. 8179390420 ఫోన్‌ నెంబర్‌ సంప్రదించాలన్నారు.

జూ పార్కులో మెగా ప్లాంటేషన్‌


మెగా ప్లాంటేషన్‌ కార్యక్రమంలో పాల్గొన్న జూ అధికారులు

చార్మినార్‌: నెహ్రూ జూలాజికల్‌ పార్కుకు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు ఉందని జూ పార్కు క్యూరేటర్‌ జే.వసంత అన్నారు. అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నెహ్రూ జూపార్కు ఆవరణలో మెగా ప్లాంటేషన్‌ కార్యక్రమం నిర్వహించారు. జూ పార్కు క్యూరేటర్‌ వసంతతో పాటు, డిప్యూటీ క్యూరేటర్‌, అసిస్టెంట్‌ క్యూరేటర్లు, డిప్యూటీ రేంజ్‌ ఆఫీసర్లు, ఫారెస్ట్‌ సెక్షన్‌ ఆఫీసర్లు, పబ్లిక్‌ రిలేషన్‌ ఆఫీసర్‌, జూ ఎడ్యుకేషన్‌ ఆఫీసర్లు కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జూపార్కు సందర్శకు లకు జంతువుల సందర్శనతో పాటు విజ్ఞానాన్ని పంచుతుందన్నారు. వన్య ప్రాణులపై అవగాహన కల్పిస్తూ, స్థానిక భారతీయ వృక్ష జాలం, జంతువుల ప్రాముఖ్య తను వివరిస్తున్నామన్నారు.

పెండింగ్‌ బిల్లులను విడుదల చేయించండి


మల్లు రవితో సమావేశమైన పోల్కం శ్రీనివాస్‌

అఫ్జల్‌గంజ్‌: వాటర్‌బోర్డులో కాంట్రాక్టర్ల పెండింగ్‌ బిల్లులు విడుదల చేయించాలని వాటర్‌ బోర్డు కాంట్రాక్టర్స్‌ జేఏసీ మీడియా ఇన్‌చార్జ్‌, రాష్ట్ర కాంగ్రెస్‌ ఓబీసీ సెల్‌ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్‌ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన కాంగ్రెస్‌ ఎంపీ డాక్టర్‌ మల్లు రవిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పోల్కం శ్రీనివాస్‌ మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న బిల్లులు రూ.8.5 కోట్లు విడుల చేయాలని స్టేట్‌ విజిలెన్స్‌ అధికారులు అప్పటి వాటర్‌బోర్డు ఎండీ దాన కిశోర్‌కు విజ్ఞప్తి చేసినా ఆయన పట్టించుకో లేదన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు గడిచినా కాంట్రాక్టర్లకు పాత బకాయిలు చెల్లించకపోవడంతో పలువురు కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మల్లు రవికి వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డితో మాట్లాడి బిల్లులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఒకటికి పోవాలంటే.. ఒకటే ఉంది!

- మెహిదీపట్నం బస్టాప్‌లో ఒకే ఒక్క మూత్రశాల
- ఉగ్గబట్టుకోలేని వారు బస్టాప్‌ పరిసరాల్లో విసర్జన
- బస్టాప్‌ పరిసరాల్లో దుర్గంధం, దుర్వాసన
- పట్టించుకోని సంబంధిత శాఖల అధికారులు
- మూత్రశాలలు లేక ప్రయాణికుల అవస్థలు



మెహిదీపట్నం బస్టాప్‌లోని మూత్రశాల

గోల్కొండ: పశ్చిమ మండలంలో అతిపెద్ద బస్టాప్‌లలో మెహిదీపట్నం ఆర్టీసీ బస్టాప్‌ ఒకటి. నగరం నుంచి శివారు ప్రాంతాలు, హైటెక్‌ సిటీ నుంచి ప్రతి గంటకు వేలాది మంది ప్రయాణికులు ఈ బస్టాప్‌ నుంచి రాకపోకలు సాగిస్తారు. ఉద్యోగులు, విద్యార్థులు సైతం ఈ బస్టాప్‌ నుంచే తమతమ గమ్యస్థానాలకు వెళ్తుంటారు. వీటన్నిటికి తోడు శివారు ప్రాంతాల నుంచి మెహిదీపట్నంకు వచ్చే వివిధ రకాల వ్యాపారులకు సైతం మెహిదీపట్నం బస్‌ డిపో కేంద్రంగా ఉంది. ఇంత రద్దీగా ఉండే బస్టాప్‌లో ఉన్నది మాత్రం ఒకే ఒక్క మూత్రశాల. అది కూడా పే అండ్‌ యూజ్‌ మూత్రశాల. ఈ మూత్రశాలను ఆనుకొని మరో మూత్రశాల ఉంది. అయితే ఇది నిర్వహణ లోపంతో ఉపయోగంలో లేకుండాపోయింది. ఉన్న ఒక్క మూత్రశాల నిర్వాహకుడు మూత్రశాలలో నీటిని అరకొరగా మాత్రమే ఉంచుతున్నాడు. దీంతో ఈ మూత్రశాలకు వెళ్లాలంటేనే ప్రయాణికులు అబ్బో అంటున్నారు.

మూత్రశాలను చూస్తే...

చేవెళ్ల, మొయినాబాద్‌ తదితర పరిసర ప్రాంతాల నుంచి నగరానికి రాకపోకలు చేసే వారు కనీసం రెండు గంటల పాటు బస్సులో ప్రయాణిస్తారు. బస్టాప్‌లోకి రాగానే వీరి చూపు మూత్రశాలల వైపు ఉంటుంది. అయితే మూత్రశాలను చూడగానే తమకు వాంతులు వస్తాయని అందుకే ఆ మూత్రశాలలను వాడుకోమని వారు అంటున్నారు. రెండు సంవత్సరాల క్రితం బల్దియా వారు ఎంతో అట్టహాసంగా ఫుట్‌పాత్‌లపై ఎక్కడపడితే అక్కడ మూత్రశాలలు ఏర్పాటు చేశారు. అయితే ఆ మూత్రశాలలు లాభసాటిగా లేకపోవడంతో వాటి నిర్వహణ పొందిన వారు గాలికి వదిలేశారు. మెహిదీపట్నం రైతు బజార్‌ ముందు ఉన్న బస్టాప్‌ వద్ద కూడా మూత్రశాల లేదు. మెహిదీపట్నం జయభూషణ్‌ ఆసుపత్రి వద్ద ఉన్న బస్టాప్‌ దరిదాపుల్లో కూడా మూత్రశాల లేదు. ఏదేమైనా ఇళ్లకు వెళ్లే వరకు నిబ్బరంగా కడుపు ఉబ్బరాన్ని భరించుకుంటున్నామని పలువురు ప్రయాణికులు అంటున్నారు.

ఫుట్‌పాత్‌పైనే ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు

నగర శివారు ప్రాంతాల నుంచి మెహిదీపట్నంకు వచ్చే బస్సుల డ్రైవర్లు, కండక్టర్లు మూత్రశాలల వైపు చూస్తుంటారు. దీనికి తోడు వికారాబాద్‌, సంగారెడ్డి, బీదర్‌, గుల్బర్గ తదితర దూర ప్రాంతాల నుంచి ప్రతినిత్యం లెక్కలేనన్ని బస్సులు వస్తుంటాయి. ఈ బస్సులను నడిపే డ్రైవర్లతో పాటు కండక్టర్లు సైతం కడుపు ఉబ్బరాన్ని తగ్గించుకోవడానికి మూత్రశాలల వైపు చూస్తుంటారు. అయితే అక్కడ ఉన్న ఒకే ఒక్క మూత్రశాల దుర్గంధ భరితంగా ఉండడంతో వారు వెనుకడుగు వేస్తున్నారు. గత్యంతరం లేక బస్‌షెల్టర్ల పక్కన ఉన్న ఫుట్‌పాత్‌లపైనే ఆర్టీసీ సిబ్బంది మూత్ర విసర్జన గావిస్తున్నారు. ఆర్టీసీ అధికారులు తమ సిబ్బంది కోసం బస్టాప్‌ వద్ద ఒక ప్రత్యేకంగా మూత్రశాల ఏర్పాటు చేస్తే ఆర్టీసీ సిబ్బందికి సౌకర్యంగా ఉంటుంది.

ఇక్కడ కూడా లేవు...

కేవలం మెహిదీపట్నం వద్దనే కాకుండా టోలిచౌకీ చౌరస్తా, రేతిబౌలి తదితర బస్టాప్‌ల వద్ద మూత్రశాలలు లేవు. టూమ్స్‌ రోడ్డు, షేక్‌పేట్‌ నాలా నానల్‌నగర్‌ తదితర ప్రాంతాలలోని బస్టాప్‌ సమీపంలో పాడుబడ్డ ఉపయోగంలో లేని మూత్రశాలలు నేటికి కనిపిస్తున్నాయి.

కాంగ్రెస్‌ హయాంలోనే బీసీల సంక్షేమం


పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

చాంద్రాయణగుట్ట: దేశంలోనే తొలిసారిగా బీసీ కుల గణన చేపట్టిన ఘనత కాంగ్రెస్‌ పార్టీకే దక్కుతుందని పార్టీ చాంద్రాయణగుట్ట నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోయ నగేష్‌ అన్నారు. బీసీ కుల గణన చేపట్టి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు ఆమోదం తెలిపినందుకుగాను శుక్రవారం చాంద్రాయణగుట్ట చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌ చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్‌ సర్కార్‌ అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి బి.వెంకటేష్‌ ముదిరాజ్‌, నాయకులు మహేష్‌ గౌడ్‌, కాశమోని శ్యాంరావు ముదిరాజ్‌, ప్రమోద్‌ రెడ్డి, శైలేష్‌, రాజు ముదిరాజ్‌, రుక్మిణీ నాయక్‌, అనురాధ, మధు తదితరులు పాల్గొన్నారు.

ఫస్ట్‌లాన్సర్‌లో ఇఫ్తార్‌ విందు

నాంపల్లి: ఏఐఎంఐఎం నాంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మహ్మద్‌ మాజీద్‌ హుస్సేన్‌ రంజాన్‌ మాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం అహ్మద్‌నగర్‌ డివిజన్‌లోని ఫస్ట్‌లాన్సర్‌ ఈద్గా గ్రౌండ్‌లో ఇఫ్తార్‌ విందును ఏర్పాటు చేశారు. నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేసిన విందుకు హైదరాబాద్‌ ఎంపీ, ఏఐఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్‌ ఓవైసీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో పలువురు ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.


ఇఫ్తార్‌ విందులో పాల్గొన్న ఎంపీ అసదుద్దీన్‌ ఓవైసీ


హజ్రత్‌ అలీ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పవిత్ర రంజాన్‌ మాసంలో 20వ రోజు సందర్భంగా శుక్రవారం ఓల్డ్‌ సిటీలో ఊరేగింపు నిర్వహిస్తున్న షియా ముస్లింలు.
– సాక్షి, సిటీబ్యూరో

తిరు కల్యాణ మహోత్సవ బ్రోచర్‌ విడుదల


బ్రోచర్‌ను విడుదల చేస్తున్న కమిటీ సభ్యులు

చాంద్రాయణగుట్ట: శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఏప్రిల్‌ 6న లలితాబాగ్‌ మల్లిఖార్జున నగర్‌ శ్రీ విఘ్నేశ్వర సాయిధామం ఆలయంలో నిర్వహించనున్న శ్రీ సీతారామచంద్ర స్వామి తిరు కల్యాణ మహోత్సవ బ్రోచర్‌ను కమిటీ సభ్యులు శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మిటీ చైర్మన్‌ మిద్దెల చంద్రశేఖర్‌ రెడ్డి, వైస్‌ చైర్మన్‌ మునిగంటి సుశీల్‌ కుమార్‌ చారి, అధ్యక్షుడు బొడ్డు వెంకటేష్‌, కోశాధికారి గుండు శ్రీకాంత్‌, యూత్‌ కమిటీ అడ్వయిజర్‌ వీరబోయిన శివకుమార్‌ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.....ఏప్రిల్‌ 4 నుంచి మూడు రోజుల పాటు గుర్రం బొజ్జన్న పంతులు పర్యవేక్షణలో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై భగవంతుడి కృపకు పాత్రులు కావాలన్నారు.

యాదాద్రి బోర్డులో స్థానం కల్పించాలి


అభివాదం చేస్తున్న విశ్వబ్రాహ్మణ విశ్వకర్మల సంఘం ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఏర్పాటు చేయనున్న యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి అలయ బోర్డులో వైదిక ఆగమ శిల్ప శాస్త్రంలో నిష్ణాతులైన విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలను సభ్యులుగా నియమించాలని తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్‌ వేముల వాడ మదన్‌మోహన్‌ అన్నారు. ఈ మేరకు శుక్రవారం బషీర్‌బాగ్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో లక్ష్మీనరసింహాస్వామి ఆలయానికి బోర్డును ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ బోర్డులో ఆగమ శిల్ప శాస్త్రం, విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ పంచదాయి శిల్పశాస్త్రంలో నిష్ణాతులైన వారిని నియమించి శిల్ప సంపదను కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు లాలు కోట వెంకటచారి, ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు కోశాధికారి రాగిఫణి రవీంద్రచారి, ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసచారి, మహిళా విభాగం అధ్యక్షురాలు లక్ష్మీరామాచారి, శిల్పి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శశిధర్‌ తదితరులు పాల్గొన్నారు.

కవిత చిత్రపటానికి పాలాభిషేకం


ఎమ్మెల్సీ కవిత చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీసీ నాయకులు అంబటి శ్రీనివాస్‌ తదితరులు

గోల్కొండ: కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలని సుదీర్ఘంగా పోరాటం చేసిన బీఆర్‌ఎస్‌ నాయకురాలు కవిత నిజమైన బీసీ నాయకురాలని పూలే ఫ్రంట్‌ రాష్ట్ర నాయకులు అంబటి శ్రీనివాస్‌ అన్నారు. అసెంబ్లీలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ఎమ్మెల్సీ కవిత చేసిన పోరాటం ఎనలేనిదన్నారు. శుక్రవారం గుడిమల్కాపూర్‌ పూలే విగ్రహం వద్ద ఎమ్మెల్సీ కవిత చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అంబటి శ్రీనివాస్‌ మాట్లాడుతూ బీసీలకు కాంగ్రెస్‌ మోండి చేయి చూపే అవకాశం ఉన్నదని ముందే పసిగట్టిన కవిత రాష్ట్ర వ్యాప్తంగా బీసీలను జాగృతం చేశారన్నారు. కార్యక్రమంలో పూలే ఫ్రంట్‌ నాయకులు విజయంద్రసాగర్‌, రామారావు, జ్యోతిరాజు, రేణుకయాదవ్‌, కనకయ్య, తిరుపతి, అక్షయ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాన్ని పునర్‌నిర్మించండి


రైల్వే జీఎంకు వినతి పత్రం అందజేస్తున్న ఈస్ట్‌ చంద్రానగర్‌ బస్తీ వాసులు

యాకుత్‌పురా: యాకుత్‌పురా రైల్వే స్టేషన్‌ ఆధునికీకరణ, అభివృద్ధి పనుల్లో భాగంగా కూల్చివేసిన శ్రీ కట్టా మైసమ్మ అమ్మవారి దేవాలయాన్ని పునర్‌ నిర్మించాలని ఈస్ట్‌ చంద్రానగర్‌ బస్తీ వాసులు అన్నారు. ఈ మేరకు శుక్రవారం దక్షిణ మధ్య రైల్వే జనరల్‌ మేనేజర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ రెయిన్‌ బజార్‌ డివిజన్‌ అధ్యక్షుడు ఈశ్వర్‌ యాదవ్‌, బస్తీవాసులు రమేష్‌, సాయి కిషోర్‌, భరత్‌ చారి, విశాల్‌, శ్రీనివాస్‌ చారి, జ్ఞానేశ్వర్‌. విజయ మాట్లాడుతూ నిర్మాణ పనుల సందర్భంగా స్టేషన్‌ పక్కన ఉన్న ఆలయాన్ని కూల్చివేసిన రైల్వే కాంట్రాక్టర్‌ తిరిగి నిర్మిస్తామని హామీ ఇచ్చాడని, అర్థాంతరంగా పనులు వదిలేశారన్నారు. దీనిపై ఇప్పటికే కేంద్ర మంత్రి కిషన్‌ రెడ్డికి వినతి పత్రం అందజేశామని, సమస్యను మరోసారి రైల్వే జీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

దేశాభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలి



సదస్సును ప్రారంభిస్తున్న ప్రొఫెసర్‌ రాజేందర్‌ సింగ్‌ తదితరులు

చార్మినార్‌: ప్రపంచంలో అత్యధిక శాతం యువత భారతదేశంలోనే ఉన్నారని, దేశాభివృద్ధిలో వారిని భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వం వికసిత్‌ భారత్‌ యూత్‌ పార్లమెంట్‌ వేడుకలు నిర్వహిస్తున్నదని కళాశాల విద్యాశాఖ సంచాలకులు ప్రొ.రాజేందర్‌ సింగ్‌ అన్నారు. వికసిత భారత్‌ యూత్‌ పార్లమెంట్‌ ఫెస్టివల్‌–2025 లో భాగంగా శుక్రవారం సిటీ కాలేజీలో జిల్లా స్థాయి పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జాతిని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలంటే యువతతోనే సాధ్యమన్నారు. వారి ఆలోచనలను గౌరవించి, వారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకునేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్‌ బాలభాస్కర్‌ మాట్లాడుతూ జిల్లా స్థాయికి ఎంపికైన అభ్యర్థులు 'ఒక దేశం ఒకే సారి ఎన్నికలు' అనే అంశంపై తమ అభిప్రాయా లను వెల్లడించాలని, ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాల్లో యువతకు కూడా చోటు కల్పించడం అభినందనీయమన్నారు. జ్యూరీ సభ్యురాలుగా హాజరైన శ్రావ్యా రెడ్డి, శ్రీకాంత్‌ మాట్లాడుతూ ఎన్నికల వ్యయాన్ని తగ్గించాలని అది దేశప్రగతికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి ఖుష్బూ గుప్తా, ఎన్‌ ఎస్‌ ఎస్‌ సమన్వయకర్త డా.డి.నాగరాజు, ప్రోగ్రాం ఆఫీసర్లు డా.సుదక్షిణ, డా.కృష్ణ చంద్ర, డా.కె.భాస్కర్‌, డా.వి.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

6 గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలం

చాంద్రాయణగుట్ట: ఆరు గ్యారంటీల ఆశ చూపి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ ప్రభుత్వం బడ్జెట్‌లో ఆయా పథకాలకు అరకొర నిధులు కేటాయించి వాటిని ఎత్తివేసేందుకు పావులు కదుపుతోందని బీజేపీ చాంద్రాయణగుట్ట అసెంబ్లీ కన్వీనర్‌ ఎడ్ల పండరీనాథ్‌ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బడ్జెట్‌లో విద్య, వైద్య రంగాలకు కూడా సరిపడా నిధులు కేటాయించలేదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 2 లక్షల ఉద్యోగాలు, రూ.4 వేల నిరుద్యోగ భృతి ఊసే లేదన్నారు. రైతు భరోసా ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బీసీల అభివృద్ధికి రూ.20 వేల కోట్లు కేటాయిస్తామని చెప్పి, కేవలం రూ.11 వేల కోట్లకే పరిమితం చేశారని ఆరోపించారు.

ఇఫ్తార్‌ విందుకు ఆహ్వానం


మహ్మద్‌ నజీబ్‌కు ఇఫ్తార్‌ ఆహ్వాన పత్రిక అందజేస్తున్న సాయిబాబాచారి

గోల్కొండ: ఇఫ్తార్‌ విందులులు ఆనందాన్ని పంచే వేదికలని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సిలింగ్‌ ఆర్గనైజేషన్‌ చైర్మన్‌ మహ్మద్‌ నజీబ్‌ అన్నారు. శ్రీ జగదాంబిక మహంకాళీ ఆలయ వృత్తిపని వారి సంఘం మాజీ అధ్యక్షుడు బొమ్మల సాయిబాబాచారి శుక్రవారం ఇఫ్తార్‌ విందు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నజీబ్‌ మాట్లాడుతూ హిందూ ముస్లీం సోదరుల మధ్య ఉన్న స్నేహ సంబంధాన్ని సాయిబాబాచారి మరింత పటిష్టం చేస్తున్నారన్నారు.

మంచినీటి సమస్య పరిష్కారం


ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్న దృశ్యం

అబిడ్స్‌: ధూల్‌పేటలోని జగ్జీవన్‌రామ్‌ నగర్‌లో మంచినీటి సమస్య పరిష్కారమైంది. కొన్ని రోజులుగా నీటి ఎద్దడితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు శుక్రవారం జగ్జీవన్‌రామ్‌నగర్‌ బస్తీలో పర్యటించిన స్థానిక బీఆర్‌ఎస్‌ నాయకులు వాటర్‌బోర్డు జీఎంతో మాట్లాడి వాటర్‌ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్‌ గౌడ్‌ మాట్లాడుతూ.... 24 గంటల్లోగా పాడైపోయిన పవర్‌బోర్డును రిపేర్‌ చేయిస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తెస్తే తక్షణ పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

మహిళలు అత్యంత శక్తివంతులు



సరోజా వివేకానంద్‌కు జ్ఞాపిక అందజేస్తున్న శ్రీవిద్యారెడ్డి తదితరులు

గోల్కొండ: మహిళలు వివక్ష ఎదుర్కొంటూ అత్యంత శక్తివంతులుగా ఎదుగుతున్నారని విశాఖ చారిటబుల్‌ ట్రస్ట్‌ ఫౌండర్‌ సరోజా వివేకానంద్‌ అన్నారు. శుక్రవారం షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజనీరింగ్‌ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ ముగింపు వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో లింగ వివక్షకు కాలం చెల్లిందన్నారు. మహిళలు సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని ఒక్కో మెట్టును దాటుకుంటూ విజయ శిఖరాలను చేరుకుంటున్నారన్నారు. మహిళల సాధికారిత కోసం మహిళా సంఘాలు అండగా ఉంటున్నాయని, వీరి పోరాటాలు అద్వితీయమని కొనియాడారు. మహిళలు, యువతుల కోసం ప్రత్యేకంగా కళాశాలలు, పాఠశాలల సంఖ్య రోజు రోజుకు పెరుగుతుందన్నారు. ఆత్మవిశ్వాసంతో మహిళలు తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకుంటున్నారని, అపరిమిత అవకాశాలు వారికి స్వాగతం పలుకుతున్నాయన్నారు. టచ్‌ ఏ లైఫ్‌ సెంటర్‌ ఫర్‌ జండర్‌ అండ్‌ పాలిటిక్స్‌, బ్రేయిన్‌ ఓ విజన్‌, సెంటర్‌ ఫర్‌ ఇంటర్‌ప్రెనోర్‌షిప్‌ డెవలప్‌మెంట్‌, స్మార్ట్‌ ఇంటర్వ్యూ, కోడ్‌ తంత్రా, సన్‌టెక్‌, బోయింగ్‌ జీరో సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో సోలార్‌ ఎనర్జీ, గ్రీన్‌ హైడ్రోజన్‌, జనరేటివ్‌ ఏఐ, ఏఆర్‌, వీఆర్‌, త్రీడి స్కానింగ్‌, విద్య, మానసిక ఆరోగ్యం, అంతరిక్ష పరిశోధన తదితర అంశాలపై చర్చలు జరిగాయి. కార్యక్రమంలో జీఎన్‌ఐటీఎస్‌ వైస్‌ చైర్‌పర్సన్‌ జి.శ్రీవిద్యారెడ్డి, ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కె.రమేష్‌ రెడ్డి, డాక్టర్‌ పి.అపర్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కళాశాల తరపున సరోజా వివేకానంద్‌కు జ్ఞాపిక అందజేశారు.

పేదలకు రేషన్‌ కిట్ల పంపిణీ


రేషన్‌ కిట్లను పంపిణీ చేస్తున్న మహ్మద్‌ మొహినుద్దీన్‌

యాకుత్‌పురా: రంజాన్‌ మాసం సందర్భంగా మజ్లీస్‌ పార్టీ అమన్‌ నగర్‌–బీ ఏరియా కమిటీ అధ్యక్షుడు మహ్మద్‌ మొహినుద్దీన్‌ అధ్వర్యంలో శుక్రవారం తలాబ్‌కట్టాలోని తన నివాసం వద్ద పేదకు నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పవిత్ర రంజాన్‌ మాసాన్ని పురస్కరించుకుని గత కొన్నేళ్లుగా పేద ప్రజలకు ఉచితంగా నిత్యావసర వస్తువులను అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆయన కుమారులు మహ్మద్‌ అయనుద్దీన్‌, మహ్మద్‌ అమానుద్దీన్‌, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తే సహించం

- పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడికి యత్నం
- నేతలు, కార్యకర్తల అరెస్టు

నాంపల్లి: రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని పీడీఎస్‌యూ నేతలు అన్నారు. బడ్జెట్‌లో విద్యా రంగానికి నిధుల కేటాయింపును నిరసిస్తూ శుక్రవారం పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. అసెంబ్లీ వైపు దూసుకు వచ్చిన పీడీఎస్‌యూ కార్యకర్తలను, నేతలను పోలీసులు ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకుని వివిధ పోలీస్‌ స్టేషన్‌లకు తరలించారు. ఈ సందర్భంగా ఉద్రిక్తతత నెలకొంది. అనంతరం పీడీఎస్‌యూ జాతీయ నాయకులు పి.మహేష్‌, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌.వి.శ్రీకాంత్‌, పొడపంగి నాగరాజు మాట్లాడుతూ... బడ్జెట్‌ కేటాయింపుల్లో విద్యారంగానికి అన్యాయం జరిగిందన్నారు. కాంగ్రెస్‌ పార్టీ మేనిఫెస్టోలో 15 శాతం నిధులు కేటాయిస్తామని చెప్పి మాట తప్పిందన్నారు. మేధావులు, విద్యావేత్తలు, విద్యార్థి సంఘాలు విద్యా రంగాన్ని గాడిలో పెట్టడానికి కనీసం 20 శాతం నిధులు కేటాయించాలని కోరినా పట్టించుకోలేదన్నారు.అందాల పోటీలు, రీజినల్‌ రింగ్‌ రోడ్డు, పార్టీ నాయకుల విగ్రహాలకు రూ. కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం విద్యా రంగంపై వివక్ష చూపడం దారుణమన్నారు. ప్రభుత్వ కేటాయింపులు ఉద్యోగుల జీత బత్యాలకు కూడా సరిపోవన్నారు. రూ.8 వేల కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్‌, ఉపకార వేతనాలు పెండింగ్‌లో ఉన్నా పట్టించుకోలేదన్నారు. ఫీజుల పేరుతో దోపిడీకి పాల్పడుతున్న కార్పొరేట్‌ విద్యా సంస్థలను నిషేధించాలని కోరారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించకుంటే మంత్రులను, ఎమ్మెల్యేలను రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు బోనగిరి మధు, పి.కిరణ్‌, జె.రాజేశ్వర్‌, సంతోష్‌, మస్తాన్‌, కె.శ్రీనివాస్‌, ఎం.ప్రవీణ్‌, రాణా ప్రతాప్‌, గౌతమ్‌, ఎం.నాగరాజు, ఎం.మహేష్‌, అలీమ్‌, పాషా, వెంకటేష్‌, మునగాల మహేష్‌, శ్యామ్‌ చరణ్‌, ఉదయ్‌ కిరణ్‌, యశ్వంత్‌, విజయ్‌, గాంధీ తదితరులు పాల్గొన్నారు.